
సాక్షి కర్నూలు

ఆదివారం ౹ 5 ౹ నవంబర్ ౹ 2023




మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానందిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు కోనేర్లలో స్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.



ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మిగనూరు ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్ -17 బాలుర ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8లో▸



నెలాఖరు వరకే ఎల్లెల్సీకి నీరు

తుంగభద్ర జలాశయంలో ఈ ఏడాది నీటి నిల్వ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ నెలఖారు వరకే తుంగభద్ర దిగువ కాలువకు నీరు వదలనున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. 8లో▸

న్యూస్‌రీల్

7న వైఎస్‌ఆర్ రైతుభరోసా రెండో విడత సాయం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ రైతుభరోసా కింద 2023-24వ సంవత్సరానికి రెండో విడత పెట్టుబడి సాయాన్ని ఈ నెల 7న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూమి యజమానులకు వైఎస్ఆర్ రైతు భరోసా కింద రూ.2వేలు, పీఎం కిసాన్ కింద రూ.2వేల ప్రకారం మొత్తం రూ.4వేలు విడుదల కానుంది. కర్నూలు జిల్లాలో 2,96,739 మంది రైతులకు రూ.122.58 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,33,969 మంది రైతులకు రూ.96.68 కోట్లు లబ్ధి చేకూరనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా బటన్ నొక్కి బ్యాంకు ఖాతాలకు నగదు విడుదల చేయనున్నారు.

కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాలపై 7న సమీక్ష

- హాజరు కానున్న ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఈనెల 7న కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమీక్షకు జిల్లా మంత్రితో పాటు సంబంధిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. కాగా, ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను తయారు చేయాలని సీపీఓ జేడీని కలెక్టర్ ఆదేశించారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు కూడా వైఎస్‌ఆర్ పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో నవంబర్ నెల వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ చురుగ్గా సాగుతోంది. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ పింఛన్లు పంపిణీ చేయనున్నారు. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్ల పైబడి వేలిముద్రలు, ఐరిష్ నమోదు కాని పింఛనుదారులు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛను పొందే వీలుంది. ఇతర కేటగిరీలకు చెందిన పింఛనుదారులు విధిగా మూడుసార్లు వేలిముద్రలు, ఐరిష్ నమోదుకు విధిగా ప్రయత్నం చేయాల్సి ఉంది. అప్పటికీ ఫెయిల్ అయితే ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛను పొందవచ్చు. పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా 10, నంద్యాల జిల్లా 6వ స్థానంలో ఉన్నాయి.

- కర్నూలు జిల్లాలో 2,46,122 పింఛన్లు ఉండగా ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల సమయానికి 2,41,325 పింఛన్లు పంపిణీ చేశారు. 98.05 శాతం పంపిణీ పూర్తయింది.

షేక్ జాఫ్రిన్‌కు ఉద్యోగం

నంద్యాల(సెంట్రల్): కర్నూలు నగరానికి చెందిన ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జాఫ్రిన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవాన్ని కట్టబెట్టింది. ఆమెను సహకార శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా గ్రూప్-1 ఉద్యోగాన్ని ఇచ్చి క్రీడా రంగం పట్ల తన ప్రాధాన్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాటుకుంది. ఈ మేరకు క్రీడా కోటాలో ఆమెకు ఉద్యోగమిస్తున్నట్లు శనివారం జీవో నంబరు-61ని విడుదల చేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కర్నూలుకు చెందిన షేక్ జాఫ్రిన్ తన సంచలన ప్రదర్శనతో దేశం గర్వ పడేలా చేశారు. 2017 డెఫ్ ఒలంపిక్స్‌లో కెప్టెన్‌గా మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత్‌కు కాంస్య పతకాన్ని అందించారు.

ఊరూరికి 'ఉపాధి'

- కరువు నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు
- పని దినాలను 100 నుంచి 150కి పెంచే యోచన
- రోజుకు 65 వేల మందికి పని కల్పించే విధంగా చర్యలు
- ఇంటింటికీ వెళ్లి డిమాండ్ తీసుకుంటున్న డ్వామా సిబ్బంది
- వలసల నివారణకు విస్తృతంగా గ్రామసభలు



కోసిగి మండలంలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): కరువు పరిస్థితుల నేపథ్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. తక్షణం అన్ని గ్రామాల్లో పనులు కల్పించి, వలసల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, సాంకేతిక సహాయకులు, ఏపీవోలు, ఏపీడీలు ఒక బృందంగా ఏర్పడి ఇంటింటికీ వెళ్తున్నారు. 'జాబ్ కార్డు ఉందా..ఉపాధి పనులకు వెళ్తున్నారా' అంటూ ఆరా తీస్తున్నారు. స్థానికంగానే పనులు కల్పించేందుకు డిమాండ్ తీసుకుంటున్నారు. గ్రామసభలు నిర్వహించి 'వలసలు వద్దు... ఇక్కడే ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం' అని భరోసా ఇస్తున్నారు.

తగ్గిన వలసలు

టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు వరుస కరువు తాండవించింది. దీంతో ఒక్క జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచే ఏటా 1.50 లక్షల కుటుంబాలు వలస బాట పట్టేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వర్షాలు సమృద్ధిగా పడటం, గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉపాధి పనులు కల్పిస్తుండటంతో 70 శాతంపైగా వలసలు తగ్గిపోయాయి. ఈ ఏడాది ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ఉపాధి పనులకు కూలీల హాజరు క్రమంగా పెరుగుతోంది. జిల్లాలో 3,19,373 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 1.81 లక్షల కుటుంబాలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నాయి.

ఇప్పటికే 76.35 లక్షల పనిదినాల కల్పన

2023-24లో 92 లక్షల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యం. ఇందులో ఇప్పటికే కూలీలకు 76.35 లక్షల పనిదినాలు కల్పించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంకా 15.65 లక్షల పనిదినాలు ఉన్నాయి. కల్పించిన పని దినాల్లో ఎస్సీలకు 15.38 లక్షలు, ఎస్టీలకు 1.01 లక్షలు, ఇతరులకు 59.96 లక్షలు ఉన్నాయి. జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంతో కుటుంబానికి కల్పించే 100 రోజుల పనిదినాలను 150కి పెంచేదిశగా గ్రామీణాభివృద్ధి శాఖ యోచన చేస్తోంది. ప్రస్తుతం ఉపాధి పనులకు 19 వేల మంది వస్తున్నారు. ప్రతి రోజు 65 వేల పనిదినాలు కల్పించే విధంగా జిల్లా కలెక్టర్ లక్ష్యాన్ని నిర్దేశించారు.

ఈ ఏడాది ఇప్పటి వరకు అత్యధికంగా పనిదినాలు కల్పించిన మండలాల వివరాలు..

మండలం	పనిదినాలు
తుగ్గలి	6,56,061
ఆదోని	4,92,914
పత్తికొండ	4,46,528
కోసిగి	3,46,763
ఓర్వకల్లు	3,87,240
కృష్ణగిరి	3,09,695
వెల్దుర్తి	3,92,280
హాలహర్వి	3,11,541
హొళగుంద	2,90,321
సి.బెళగల్	3,44,741
కోడుమూరు	2,21,115
ఆస్పరి	3,07,015

50 వేల కుటుంబాలకు..

ఈ ఏడాది 50 వేల కుటుంబాలకు 100 రోజుల పని దినాలు కల్పించే దిశగా జిల్లా నీటియాజమాన్య సంస్థ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటి వరకు ఎస్సీల్లో 413 కుటుంబాలకు, ఎస్టీల్లో 33 కుటుంబాలకు, ఇతరుల్లో 2,052 కుటుంబాల ప్రకారం మొత్తం 2,498 కుటుంబాలకు 100 రోజుల పని దినాలు కల్పించారు. ఇప్పటి వరకు 60 నుంచి 99 రోజుల పని దినాలు పూర్తి చేసిన కుటుంబాలు దాదాపు 48 వేలు ఉన్నాయి. జిల్లాలో ఎంతమందికైనా ఉపాధి పనులు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుతం 50 లక్షల పని దినాలు కల్పించేందుకు అవసరమైన పనులు సిద్ధంగా ఉన్నాయి.

ఉపాధి భరోసా ఇస్తోంది



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మాకు ఎంతో భరోసా ఇస్తోంది. ఉపాధి పనులు లేకపోతే మేం వలసపోవాల్సిన పరిస్థితి ఉండేది. జాబ్‌కార్డులో నాతో పాటు నా భార్య స్రవంతి కూడా ఉంది. ఇద్దరం ఉపాధి పనులకు వెళ్తున్నాం. వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాం. రోజుకు రూ.270.11 ప్రకారం వేతనం లభించింది. కల్లూరు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించింది. ఇందువల్ల పని దినాలను 150 రోజులకు పెంచే అవకాశం ఉంది. ఇది కూడా మాకు కలసి రానుంది.


– శేఖర్, బస్తిపాడు, కల్లూరు మండలం

అవగాహన కల్పిస్తున్నాం



గ్రామసభలు ఏర్పాటు చేసి ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వలసలు వద్దు ప్రతి ఒక్కరికీ ఇక్కడే పనులు కల్పిస్తామని దండోరా వేయిస్తాం. అవసరమైన వారికి జాబ్ కార్డులు జారీ చేస్తున్నాం. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నాం. ఈ ఏడాది 92 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా ఇప్పటికే 76.36 లక్షల పనిదినాలు కల్పించాం. ఉపాధి పనులకు వచ్చే వారికి రోజుకు రూ.250 నుంచి రూ.272 వేతనం దక్కే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా



కర్నూలులో కుండపోత వర్షం



కర్నూలు మద్దూర్ నగర్‌లో జలమయమైన ప్రధాన వీధి



లోతట్టు ప్రాంతంలో నీరు నిలిచిన దృశ్యం

- 112.2 మి.మీ. వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఈ నెల 15 వరకు శనగ సాగుకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. ఉరుములు, మెరుపులతో కర్నూలులో కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 6.30 నుంచి దాదాపు గంటన్నర పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కర్నూలు నగరంలో 112.2 మి.మీ.(11.2 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైంది. పాత బస్టాండు ప్రాంతం మొత్తం మూడు అడుగుల నీరుతో నిండిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కృష్ణానగర్ మొత్తం చెరువును తలపించింది. ఆనంద్ థియేటర్ దగ్గర కేసీ కెనాల్ బ్రిడ్జి కిందకు వర్షపునీరు నిలిచింది. దీంతో వాహనాలు రాకపోకలు స్తంభించాయి. నగరంలో డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రోడ్లు జలమయం అయ్యాయి. గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల దేవనగర్ సత్యనారాయణ స్వామి గుడి ఎదుట అటవీ శాఖ కార్యాలయంలో ఒక పెద్ద వృక్షం నేల కూలింది. భారీ వర్షంతో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు చిత్తడిగా మారింది. వర్షానికి ఉల్లిగడ్డలు తడిచిపోయాయి. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలో 39.75 మి.మీ., కర్నూలు మండలం పూడూరులో 36 మి.మీ. ప్రకారం వర్షం కురిసింది. వర్షాలు పడితే రబీ సీజన్‌కు సంబంధించి ఈ నెల 15 వరకు శనగ సాగు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు.

అన్నదాతకు కమ్మనైన భోజనం

- ఆదోని మార్కెట్‌యార్డులో రూ.15కే సబ్సిడీ భోజనం
- ప్రారంభించిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



రైతులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు కేవలం రూ.15కే రుచికరమైన సబ్సిడీ భోజనం అందించే కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. యార్డు డైరెక్టర్ బసవరాజు, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంతలతో కలిసి రిబ్బన్ కట్ చేయించి సబ్సిడీ భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీకృష్ణ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వయంగా రైతులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేవలం రూ.15 చెల్లించి కడుపునిండా భోజనం చేయాలన్నారు. బయట హోటల్‌లో రూ.70 నుంచి రూ.100 పెట్టినా ఇంత రుచికరమైన భోజనం దొరకదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్కాన్ సంస్థతో మాట్లాడి నాణ్యతతో కూడిన భోజనాన్ని అందిస్తోందన్నారు. ఇందుకు వ్యవసాయ మార్కెట్‌యార్డు రూ.20, రైతు రూ.15 చెల్లిస్తే, ఇస్కాన్ సంస్థ మిగిలిన మొత్తాన్ని భరిస్తుందన్నారు. ప్రతిరోజూ సమయానికి భోజనం అందుతుందని, రైతులు ఈ సబ్సిడీ భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యార్డులో ఏదైనా సమస్య వస్తే వెంటనే యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డిని సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని మద్దతు ధరతో అమ్ముకోవచ్చన్నారు. ఇందుకోసం రైతుభరోసా కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యార్డు సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్, వైస్ చైర్మన్ తిమ్మప్ప, డైరెక్టర్‌లు, నాయకులు పాల్గొన్నారు.



హాలులో భోజనం చేస్తున్న రైతులు

బ్రహ్మాండంగా ఉంది



యార్డులో భోజనం బ్రహ్మాండంగా ఉంది. పెళ్లిళ్లలో మాదిరిగా అన్ని రకాలు వడ్డిస్తున్నారు. బయట రూ.100 పెట్టినా ఇంతటి రుచికరమైన భోజనం దొరకదు. కడుపు నిండదు. రూ.15కే కడుపునిండా భోజనం పెట్టారు. ఎంతో బాగుంది.

– సంజన్న, జూటూరు గ్రామ రైతు, పత్తికొండ మండలం

ఈ-క్రాప్ బుకింగ్ సంపూర్ణం

రైతుల సంఖ్య	సాగు చేసిన పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)
2,10,397	పత్తి	5,00,975
75,208	ఎండుమిర్చి	1,48,447
34,753	వేరుశనగ	77,165
25,461	ఉల్లి	41,696
21,347	వరి	31,267
47,311	కంది	89,492

కర్నూలు (అగ్రికల్చర్): 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ సంపూర్ణంగా ముగిసింది. క్షేత్రస్థాయిలో పంటల నమోదు కార్యక్రమం అక్టోబర్ నెల 10వ తేదీతో ముగిసినప్పటికి రైతులతో ఈ-కేవైసీ చేయించడం, సూపర్ చెక్ నిర్వహించడం, సోషల్ ఆడిట్, గ్రామసభల నిర్వహణ తదితర కార్యక్రమాలు సుదీర్ఘంగా చేపట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎలాంటి పొరపాట్లకు, లోపాలకు తావు లేకుండా ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో 10,17,374 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. అయితే 9,73,650 ఎకరాలకు సంబంధించి 3,25,851 మంది ఈ-కేవైసీ ద్వారా సాగు చేసిన పంటలను ధృవీకరించారు. ఈ-కేవైసీ 95.80 శాతం పూర్తయింది. ఈ-క్రాప్ డేటాను త్వరలో బీమా కంపెనీలకు ఇవ్వడానికి వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, నిర్వాహకులు



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న 13 జిల్లాల విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అండర్ 17 బాలుర విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయపతాకంతో పాటు స్పోర్ట్స్ పతాకాన్ని ఆవిష్కరించి, జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులతో చర్చించి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నారన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపే వారిని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఉమ్మడి కర్నూలు జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మయ్య.శివకుమార్ ,సెట్కూర్ సీఈఓ రమణ, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు మొరార్జీ, పోటీల రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రభాకర్, రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, ఫుట్‌బాల్ కోచ్ మాబు, ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు పాల శ్రీనివాసరెడ్డి, విశ్వనాథ్ రమేష్, కె.విశ్వనాథ్, కౌన్సిలర్ కేశవరెడ్డి, హెచ్‌ఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో వ్యభిచార ముఠా అరెస్ట్

ఆదోనిఅర్బన్: వ్యభిచార ముఠాను అరెస్ట్ చేసినట్లు ఆదోని త్రీటౌన్ సీఐ నరసింహరాజు శనివారం విలేకరులకు తెలిపారు. తిరుమలనగర్ ఆల్ బ్యాంకర్స్ కాలనీలోని ఓ ఇంట్లో టైలరింగ్ శిక్షణ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తమకు పక్కా సమాచారం వచ్చిందన్నారు. ఎస్‌ఐలు విజయలక్ష్మి, జయశేఖర్ నేతృత్వంలో దాడులు నిర్వహించి ఇద్దరు మహిళలతో పాటు ఏడుగురు విటులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కలకత్తా, బెంగళూరు, కర్నూలు వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను పిలిపించి వ్యభిచారం చేయిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. వారి నుంచి రూ.11,200 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు, మూడు కండోమ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. వ్యభిచార ముఠా గుట్టురట్టు చేసిన పోలీసులను ఎస్పీ కృష్ణకాంత్, డీఎస్పీ శివనారాయణస్వామి అభినందించారు.

రెండో విడత పీజీ కౌన్సెలింగ్‌కు రేపటి నుంచి రిజిస్ట్రేషన్

కర్నూలు (న్యూటౌన్): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో రెండో విడత పీజీ కౌన్సెలింగ్‌కు సోమవారం నుంచి https:// pgcet&sche.aptonline.in/APPGCET/ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీ సెట్-2023లో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులని పేర్కొన్నారు. ఎంఏ ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఉర్దూ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, బాటనీ, జువాలజీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. ఈ నెల 7 నుంచి 10 వరకు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని, ఈ నెల 13 నుంచి 15లోగా వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ నెల 18న విద్యార్థులకు సీట్ల కేటాయింపు జరుగుతుందని, 20 నుంచి 23వ తేదీలోగా యూనివర్సిటీలో రిపోర్ట్ చేసుకోవాల్సి ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం వర్సిటీలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని, మరిన్ని వివరాలకు 8520053995, 7901628490 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలి

- అధికారులను ఆదేశించిన సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): బడిఈడు పిల్లలందరూ నూటికి నూరు శాతం పాఠశాలల్లో ఉండాలని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన విజయవాడ నంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఐదో తరగతి చదివిన వారంతా ఆరో తరగతిలో ప్రవేశం పొందాలన్నారు. బాల్య వివాహాల నివారణకు అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడే పిల్లలు, మహిళలకు టేక్ హోం కిట్ల ద్వారా పౌష్టికాహారాన్ని సరఫరా చేయాలన్నారు. నాడు-నేడుకు సంబంధించి పాఠశాలలో పెండింగ్ ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఇన్‌చార్జి సీపీఓ భారతి, సమగ్రశిక్ష అభియాన్ పీఓ వేణుగోపాల్, డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య, డీఐఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతుని కుటుంబానికి ప్రభుత్వం అండ

- రూ.20 లక్షల ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మృతుని తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: రైలు ప్రమాద మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. విజయనగరం జిల్లాలో అక్టోబర్ 29వ తేదీన జరిగిన రైలు ప్రమాదంలో కోసిగి మండలం అగసనూరు గ్రామానికి చెందిన చాకలి తాయప్ప(21) మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేందుకు వెళ్తూ ఈ యువకుడు మృతి చెందాడు. మృతుని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రైల్వే శాఖ నుంచి రూ.10లక్షలు ఆర్థిక సాయం మంజూరైంది. శనివారం మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చేతుల మీదుగా చెక్కును గ్రామస్తుల సమక్షంలో ఆ యువకుడి తల్లిదండ్రులు చాకలి పాలన్న, నాగమ్మకు అందజేశారు. కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామ సర్పంచ్ ఉలిగయ్య, మాజీ సర్పంచ్ ఆకాష్ రెడ్డి, ఎంకే నాగేష్, హనుమప్ప, బాబు రెడ్డి, కర్రెప్ప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం



సంఘీభావాన్ని తెలియజేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు(న్యూటౌన్): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం బడుగు, బలహీన వర్గాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన చారిత్రక అవసరం ఎంతైనా ఉందన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ విజయమనోహరి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, వైఎస్సార్‌సీపీ నేత అహ్మద్ అలీఖాన్, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ యూనుస్‌బాషా, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో జగనన్నను జై కొడదామన్నారు. రిటైర్డ్ తహసీల్దార్ రోషన్ అలీ, నాయకులు అజయ్‌కుమార్, గోనెగండ్ల మురళీ నాయుడు, చంద్రకళ, చంద్రికమ్మ, జమీలమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మొదటి రోజు విశేష స్పందన

- ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించిన బీఎల్‌ఓలు



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ హరిప్రసాద్

కర్నూలు(సెంట్రల్): ప్రత్యేక ఓటరు అవగాహన సదస్సులకు మొదటిరోజు విశేష స్పందన లభించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని 2,186 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటరు అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా అవగాహన సదస్సుల్లో భాగమై అనుమానం ఉన్న ఓటర్ల తొలగింపు, 18 ఏళ్లు నిండిన వారిని చేర్పించేందుకు దరఖాస్తులు ఇచ్చారు. ప్రత్యేక ఓటరు అవగాహన సదస్సులు ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ప్రస్తుత ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 19,71,325 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 9,78,663, మహిళలు 9,92,356, ఇతరులు 306 మంది ఉన్నారు.

క్లుప్తంగా

నెలాఖరు వరకే ఎల్లెల్సీకి నీటి సరఫరా

హొళగుంద: కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర జలాశయానికి గత కొద్ది రోజులుగా నీటి చేరిక(ఇన్‌ఫ్లో) నిలిచిపోవడంతో నిల్వ కూడా వేగంగా తగ్గుతోంది. శనివారం నాటికి 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యంలో 29 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 3,336 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండి 1,633 అడుగుల వద్ద 103.500 టీఎంసీల నీటితో జలాశయం కళకళలాడింది. అయితే ప్రస్తుతం 1,605.50 అడుగల వద్ద 29 టీఎంసీల నీరు ఉండగ 8,976 క్యూసెక్కులను వివిధ కాలువలకు విడుదలవుతోంది. ఈ ఏడాది అనావృష్టి కారణంగా డ్యాంలో ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. ఇక ఎల్లెల్సీ ఆంధ్రలో 250 కి.మీ వద్ద 557 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఈ ఏడాది జలాశయంలో నీటి నిల్వ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ నెలఖారు వరకే తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు నీరు వదలనున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

లారీ బోల్తా



పాణ్యం: కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలో అదుపు తప్పి శనివారం ఉదయం లారీ బోల్తా పడింది. తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల నుంచి కోళ్ల లోడ్‌తో నంద్యాలకు వెళ్తున్న లారీ అదుపు తప్పి బ్రిడ్జిని ఢీకొట్టి హైవేపై బోల్తా పడింది. హైవే సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. రహదారిపై అడ్డంగా పడిన లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సంతానం కలగలేదని బలవన్మరణం



మృతిచెందిన మాధవి

దేవనకొండ: సంతానం కలగలేదని మనస్తాపం చెంది ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన శనివారం దేవనకొండలోని బుడగజంగాల కాలనీలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. సుంకన్నతో మాధవి(30)కి 12 ఏళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడంతో మాధవి మనస్తాపం చెందింది. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన భర్త సుంకన్న ఉరి నుంచి భార్యను దింపి వైద్యం కోసం పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు పెద్ద జమ్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టుపై ట్రిపుల్ ఐటీకి సంబంధించిన భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వుతుండగా జిల్లా మైనింగ్ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. టిప్పర్, జేసీబీతో ఎర్రమట్టిని అక్రమంగా తవ్వుతుండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు మండలం బీ తాండ్రపాడుకు చెందిన మస్తాన్, అశోక్‌కు రూ.70వేల అపరాధ రుసుం విధించి, వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ వెల్లడించారు. ఈ దాడుల్లో ఏడీ విజిలెన్స్ బైరాగి నాయుడు పాల్గొన్నారు.